సాక్షి
ఖమ్మం
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



సత్వర న్యాయం..
కక్షిదారులకు సత్వర న్యాయం, శాశ్వత పరిష్కారం అందించేలా శనివారం లోక్ అదాలత్ నిర్వహించనున్నారు.
8లో



తీరని యూరియా వెతలు
పలు ప్రాంతాల్లో యూరియా సరిపడా లేక రైతులకు కూపన్ల ఆధారంగా ఒక్కో బస్తానే పంపిణీ చేయడంతో నిరసన తెలిపారు.
8లో

గరిష్టం / కనిష్టం
30° / 23°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై, చల్లగాలులు వీస్తాయి.

చకచకా సీఎంఆర్

2024-25 రబీ ధాన్యంలో 80 శాతం సేకరణ

- ఈ నెలాఖరులోగా మిగిలినదీ పూర్తి
- రేషన్‌షాపుల్లో పంపిణీ నేపథ్యాన ప్రత్యేక దృష్టి
- గతంలో అవకతవకలకు పాల్పడిన మిల్లర్లపై చర్యలకు సిద్ధం



తల్లాడ మండలం కొత్తూరులోని రైస్ మిల్లులో బియ్యంను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో 2024–25 యాసంగికి సంబంధించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) సేకరణపై పౌరసరఫరాల సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రేషన్‌షాప్‌ల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో గడువులోగా సీఎంఆర్ సేకరించే లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. జిల్లాలో యాసంగిలో 3,06,446.600 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పౌర సరఫరాల సంస్థకు చేరాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 2,44,901.277 మెట్రిక్ టన్నులు అందాయి. అంటే 80 శాతం మేర బియ్యం చేరగా, మిగిలిన బియ్యాన్ని ఈ నెలాఖరులోగా సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మరోపక్క 2024–25 వానాకాలం సీఎంఆర్ సేకరణ కూడా 98శాతం పూర్తయింది. ఇక 2023–24 ఏడాదిలో సీఎంఆర్ ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడిన మిల్లర్లలో ఇద్దరికి నోటీసులు ఇవ్వగా.. ఇంకో మిల్లర్‌పై కేసు పెట్టారు.

గడువుతో గడిపేస్తూ..

గత కొన్నేళ్లుగా మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం పలుమార్లు గడువు పొడిగిస్తున్నా మిల్లర్లు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. జిల్లాలో ఏటా పౌరసరఫరాల సంస్థ సుమారు 70 మిల్లులకు ధాన్యాన్ని మిల్లింగ్ కోసం ఇస్తోంది. ధాన్యం మర ఆడించాక 67 శాతం బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థకు అందించాల్సి ఉంటుంది. కానీ ఎప్పుడు కూడా గడువులోగా ఇవ్వకపోవడమే కాక సాకులతో కాలం వెళ్లదీస్తున్నారు. 2023–24 సీజన్ వరకు ఇదే పరిస్థితి కొనసాగడంతో అవసరాలకు బియ్యం కేటాయించడం ఇబ్బందిగా మారింది.

2024-25 యాసంగిలో మిల్లులకు కేటాయించిన ధాన్యం, సీఎంఆర్ సేకరణ (మె.టన్నుల్లో)

కేటాయించిన ధాన్యం	4,56,167
మిల్లర్లు ఇవ్వాల్సిన సీఎంఆర్	3,06,446.600
ఇప్పటి వరకు సరఫరా	2,44,901.277
బకాయి బియ్యం	61,545.323

యాసంగిలో 80 శాతం

2024–25 ఏడాది వానాకాలంలో 98 శాతం, యాసంగిలో 80 శాతం సీఎంఆర్ సేకరణ పూర్తయింది. యాసంగి సీజన్‌లో మిల్లర్లకు 4,56,167 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగిస్తే అందులో 3,06,446.600 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 2,44,901.277 మెట్రిక్ టన్నులు అందించారు. మిగతా బియ్యాన్ని సైతం ఈనెలాఖరులోగా సేకరించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఆ మిల్లర్లపై చర్యలు..

గతంలో చాలా మిల్లులు గడువులోగా సీఎంఆర్ ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడ్డాయి. 2023–24లో హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపట్టడంతో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లుగా తేలింది. దీంతో మిల్లర్లకు జరిమానా విధించినా చెల్లించలేదు. మూడు మిల్లులకు నోటీసులు జారీ చేస్తే రెండు మిల్లుల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. మరో మిల్లుపై ఇప్పటికే కేసు నమోదైంది. అయితే అవకతవకలకు పాల్పడిన మిల్లర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా అలాంటి చర్యలు తీసుకోలేదు.

పక్కదారి పట్టకుండా..

ఈ ఏడాది ఉగాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అంతేకాక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, వసతిగృహాల్లో భోజనానికి సైతం సన్న బియ్యం అందిస్తున్నారు. ఈనేపథ్యాన గడువులోగా సీఎంఆర్ సేకరించేలా అధికారులు దృష్టి సారించారు. ప్రతినెలా రేషన్ షాపులు, ఇతర అవసరాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలంటే ముందస్తుగా నిల్వ చేయడం తప్పనిసరి. దీంతో బియ్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించకుండా గడువులోగా అందించేలా అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇదే సమయాన మిల్లుల్లో ధాన్యం, బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా పెట్టారు.

గడువులోగా సేకరిస్తాం..



సీఎంఆర్ త్వరగా సేకరించేంలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే 80 శాతం మేర సన్న బియ్యం అందింది. ఈనెలాఖరు వరకు గడువు ఉన్నందున మొత్తం సేకరిస్తాం. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో సరిపడా నిల్వ ఉండేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

న్యూస్‌రీల్

డంపింగ్ యార్డ్‌కు స్థలం గుర్తించండి



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా: వైరా మున్సిపాలిటీలో డంపింగ్ యార్డ్‌కు అనువైన స్థలాన్ని గుర్తించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ ఆదేశించారు. వైరా మండలం ముసలిమడుగులో స్థలాన్ని ఆమె తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. అయితే, ఈ స్థలం దూరంగా ఉన్నందున, కొణిజర్ల, తల్లాడ మండలాల్లో రెండెకరాల స్థలాన్ని ఎంపిక చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ యు.గురులింగం తదితరులు పాల్గొన్నారు.

యాత్రాదానానికి విరాళాలు అందించండి

ఖమ్మంమయూరిసెంటర్: సామాజిక బాధ్యతలో భాగంగా ఆర్టీసీ 'యాత్రాదానం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం ఈ కార్యక్రమ ఉద్దేశమని వెల్లడించారు. ఇందులో భాగంగా ఆసక్తి ఉన్న వారు ప్రత్యేక రోజులు, పండుగల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక నిధికి విరాళం ఇస్తే బస్సులు సమకూరుస్తామని తెలిపారు. ఇందుకోసం వ్యక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్ఆర్ఐలు, ఎన్జీవోలు నగదు సమకూర్చవచ్చని పేర్కొన్నారు. నిరుపేదలనే కాక సభ్యులు, బంధువులు, స్నేహితులను కూడా యాత్రకు తీసుకెళ్లవచ్చని, వివరాల కోసం డిపోల్లో లేదా 040-69440000, 040-23450033 నంబర్లలో సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలి

ఉద్యోగ సంఘాలతో కలెక్టర్ అనుదీప్



నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: అడ్డంకులను అధిగమించి రాజీవ్ స్వగృహ సముదాయాన్ని దక్కించుకోవడంపై ఉద్యోగ సంఘాల నాయకులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహ సముదాయాన్ని ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీ బిడ్‌లో కైవసం చేసుకోగా, నాయకులు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రత్యేక ఒరవడి కలిగిన జిల్లా ఉద్యోగులు ప్రాజెక్టును విజయవంతం చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొనిదెన శ్రీనివాసరావు, టీజీవోస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, నాయకులు విజయ్, రాంబాబు, జైపాల్, వెంకన్న, దుర్గాప్రసాద్, హరికృష్ణ, కోణార్క్, ప్రభాకరాచారి, రుక్మారావు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను వివిధ పార్టీల నాయకులతో కలిసి కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భద్రత, అగ్నిమాపక యంత్రాల నిర్వహణపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఉద్యోగులు ఎం.ఏ.రాజు, అన్సారీ పాల్గొన్నారు.

శరవేగంగా భూసర్వే





భూమి సర్వే చేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) పంప్‌హౌస్ నిర్మాణానికి చదును చేస్తున్న యంత్రాలు

- 'జవహర్' ఎత్తిపోతల పథకానికి 193.15 ఎకరాల భూమి అవసరం
- 40మంది ఉద్యోగులతో సర్వే
- ఇప్పటికే మొదలైన పంప్‌హౌస్ పనులు

మధిర: మధిర మండలంలోని వంగవీడు సమీపాన వైరా నదిపై నిర్మించే జవహర్ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణపై యంత్రాంగం దృష్టి సారించింది. వైరా నదిపై రూ.630 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం నిర్మించి పైప్‌లైన్ల ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఈమేరకు అవసరమైన 193.15 ఎకరాల భూసేకరణకు 40 మంది సిబ్బందితో సర్వే చేయిస్తున్నారు. వైరా నదిపై చెక్‌డ్యామ్, ఆ పక్కన పంప్‌హౌస్ నిర్మించి అక్కడి నుంచి మూడు పైపులైన్ల ద్వారా నీరు ఎత్తిపోస్తారు. భూమి నుంచి ఆరు అడుగుల లోపల పైప్‌లైన్లు వేసే క్రమాన మధ్యలో బోర్లు ఉన్నా ఇబ్బంది ఎదురుకాకుండా భూసేకరణకు నిర్ణయించారు. అంతేకాక పైప్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ కోసం ఓ వైపు రోడ్డు నిర్మిస్తారు. ఇప్పటికే పంప్‌హౌస్ పనులు మొదలుకాగా.. పైప్‌లైన్, రహదారికి అవసరమైన భూసేకరణకు కసరత్తు మొదలుపెట్టారు.

మూడు మార్గాల్లో..

వైరా నదిపై పంప్‌హౌస్ నుంచి మూడు మార్గాల్లో పైపులైన్లు వేస్తారు. ఇందులో ఒకటి 11.2 కి.మీ. పొడవుతో నిర్మించి నిధానపురం మేజర్ కెనాల్ 38వ కి.మీ. వద్దకు నీరు చేరుస్తారు. ఇక 26 కి.మీ. పొడవైన రెండో పైప్‌లైన్ ద్వారా జమలాపురం మేజర్ వద్ద ఉన్న కాల్వలోకి నీటిని విడుదల చేస్తారు. అలాగే, మూడో పైప్‌లైన్ 27 కి.మీ. ఉంటుందని.. దీనిద్వారా మైలవరం మేజర్ కెనాల్‌లోకి నీటిని డంపింగ్ చేస్తారు. తద్వారా ఏపీ భూభాగం నుంచి సాగునీరు తీసుకోకుండానే జవహర్ ఎత్తిపోతల ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధి చివరి ఆయకట్టుకు నీరందిస్తారు. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని సాగర్ జోన్-3 నుంచి జోన్-2లోగా మార్చారు. ఎత్తిపోతల పథకం కూడా పూర్తయితే కు ఇన్నాళ్లు చివరి ఆయకట్టుకు నీరందక నష్టపోయిన రైతులకు మేలు జరగనుంది. మధిర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో తమ సాగునీటి కష్టాలు తీరనున్నాయని రైతులు చెబుతున్నారు.

భూసేకరణ

మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలో 37వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. పైప్‌లైన్ ఏర్పాటుతో పాటు ఇతర పనులకు మొత్తం 193.15 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. మధిర మండలంలో 116.35, ఎర్రుపాలెం మండలంలో 76.20 ఎకరాల భూసేకరణ నిర్ణయించారు. మధిర మండలంలోని వంగవీడులో 19.21, మునగాలలో 20.38, ఆత్కూరులో 16.27, మాటూరులో 25.18, నాగవరప్పాడులో 9.26, సిద్దినేనిగూడెంలో 21.28, ఎర్రుపాలెం మండలంలోని గోసవీడులో 25.37, అయ్యవారిగూడెంలో 12.47, భీమవరంలో 12.31, గుంటుపల్లి గోపవరంలో 3.27, మామునూరులో 25.38 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

సమీక్షించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవ్యవసాయం: కేంద్రప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేసేలా జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. పత్తి అమ్మకం, ధరలో రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఈఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగవుతుండగా 27,07,356 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందని తెలిపారు. ఈ పంట కొనుగోలుకు ఐదు మార్కెట్ల పరిధి తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో కేంద్రాలు ఏర్పాటుచేయాలని చెప్పారు. అయితే, రైతులు మద్దతు ధర పొందడానికి ఆధార్ తప్పనిసరని, కపాస్ కిసాన్ యాప్‌లో నమోదయ్యే అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీమ్, సీపీఓ ఏ.శ్రీనివాస్, ఆర్‌టీఓ వెంకటరమణ, సీసీఐ జిల్లా ఇన్‌చార్జ్ అవినాష్, ఎస్‌బీ సీఐ రాజిరెడ్డి, విద్యుత్ డీఈ రామారావు పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు



ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛను హరించేలా తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును పలువురు తప్పుపడుతున్నారు. 'సాక్షి' తెలుగు దినపత్రికకు చెందిన పలు ఎడిషన్ కేంద్రాలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేసి ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ విషయంలో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదు. ఇక ప్రభుత్వం హామీల అమలులో చేస్తున్న జాప్యంపై ప్రజల పక్షాన వార్తలు ప్రచురిస్తే మాత్రం కేసులు నమోదు చేసి సాక్షి కార్యాలయాలు, జర్నలిస్టుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. తాజాగా 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి, రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను అక్కడి ప్రభుత్వం తమ గుప్పిట్లోకి తీసుకునేలా చేస్తున్న ప్రయత్నాలపై పలువురు మండిపడ్డారు.

– ఖమ్మం సహకారనగర్ / ఖమ్మం లీగల్

దాడులు నిలిపేయాలి



సమాజ శ్రేయస్సు, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడం హేయమైన చర్య. ఏపీలో 'సాక్షి' పత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై అక్కడి ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరించడం సరికాదు. ప్రజాస్వామ్యంలో నాలుగో మూలస్తంభంగా వ్యవహరించే పత్రికా రంగంపై దాడులను నిలిపేయాలి. 'సాక్షి' ఎడిటర్, జర్నలిస్టులపై నమోదుచేసిన కేసులను ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

– మోదుగు వేలాద్రి, టీజీవోస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి

అక్రమ కేసులు గర్హనీయం



'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేయడం గర్హనీయం. ప్రభుత్వాలు ఇలా కక్షపూరితంగా వ్యవహరించడం సరైన విధానం అనిపించుకోదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నప్పుడు నియంతృత్వంతో వ్యవహరించడం, పత్రికాస్వేచ్ఛను అణచివేసేలా ప్రభుత్వాలు ప్రయత్నించడం శోచనీయం. మీడియా కార్యాలయాలపై దాడులు, జర్నలిస్టులపై కేసులను ఖండిస్తున్నాం.

– కర్లపూడి శ్రీనివాసరావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఖమ్మం

గొంతు నొక్కేయడం కక్షే..



పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కేయడం సరికాదు. ఇది భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేయడం, అక్కడ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం తగదు. ప్రజల పక్షాన నిలిచే వారిపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

– సింగం జనార్దన్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్, ఖమ్మం

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే కాక ప్రజలను చైతన్యవంతులను చేసేలా పత్రికలు వ్యవహరిస్తాయి. అలాంటి పత్రికల స్వేచ్ఛను హరించడం సరికాదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరాలన్నా... ప్రజలకు ఏమేం వసతులు కావాలో ప్రభుత్వం దృష్టికి వెళ్లడంలో పత్రికలు కీలకంగా నిలుస్తాయి. కానీ ఏపీలో ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, జర్నలిస్టులపై కేసులు పెట్టడం సరికాదు.

– ఎస్.విజయ్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా

రేషన్ షాప్‌ల్లో డీఎస్‌ఓ తనిఖీ



సూచనలు చేస్తున్న డీఎస్‌ఓ చందన్‌కుమార్

ఏన్కూరు: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ షాపులను డీఎస్‌ఓ చందన్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. రాజులింగాల, తిమ్మారావుపేట, శ్రీరాంపురంతండాల్లో షాపుల ద్వారా బియ్యం పంపిణీని పరిశీలించిన ఆయన డీలర్లకు సూచనలు చేశారు. లబ్ధిదారులకు సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ నంబర్ 98682 00445కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆర్‌ఐ వీరయ్య పాల్గొన్నారు.

నేడు సురవరం సంస్మరణ సభ

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం ఖమ్మంలో నిర్వహించనున్నారు. సాయంత్రం 5గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ మొదలవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

ఖమ్మం మీదుగా వారాంతపు రైలు

ఖమ్మం రాపర్తినగర్: చర్లపల్లి – అనకాపల్లి నడుమ ఈనెల 13నుంచి వారాంతపు రైలు ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు. చర్లపల్లిలో ప్రతీ శనివారం రాత్రి 8గంటలకు బయలుదేరే రైలు ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు అనకాపల్లికి చేరుతుందని తెలిపారు. ఈ రైలు ఖమ్మంకు రాత్రి 11–11గంటలకు వస్తుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి–చర్లపల్లి రైలు అర్ధరాత్రి 1–28 గంటలకు ఖమ్మం స్టేషన్‌కు వస్తుందని అధికారులు తెలిపారు.

ఉద్యోగాలకు 18 మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది ఎంపికయ్యారు. అపోలో ఫార్మసీలో వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహించగా హాజరైన 35 మందిలో 18 మంది ఎంపిక కాగా నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖఅధికారి కొండపల్లి శ్రీరాం, అపోలో ఫార్మసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

17న సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈనెల 17న నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ.బేబీ హాజరుకానున్నారని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం నాయకులు బండి రమేష్, వై.విక్రమ్‌తో కలిసి మాట్లాడారు. సభలో బేబీతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు, తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈమేరకు సభను విజయవంతం చేయాలని కోరారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

తిరుమలాయపాలెం: తపాలా శాఖ అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి సూచించారు. పోస్టల్ బీమా తీసుకుని ఇటీవల ప్రమాదానికి గురైన మండలంలోని తిప్పారెడ్డిగూడెం వాసి వేల్పుల భద్రమ్మకు రూ.1,08,000 చెక్కును శుక్రవారం ఆయన అందజేసి మాట్లాడారు. తక్కువ ప్రీమియంతో పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ కాళీ మహేశ్వరి, ఉద్యోగులు రాజేష్, వెంకయ్య, పాండు, సారయ్య పాల్గొన్నారు.

భద్రాచలం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో పెరిగిన పనిభారం, మస్టర్ల కుదింపునకు వ్యతిరేకంగా ఐదు రోజుల నుంచి అక్కడి ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఖమ్మం రీజియన్ ఆర్టీసీ జేఏసీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం ఖమ్మంలో పర్సనల్ ఆఫీసర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. భద్రాచలం డిపో మేనేజర్ కార్మికులపై భారం మోపుతూ మస్టర్లు కుదిస్తున్నారని తెలిపారు. నాయకులు ఏ.కృష్ణ, వినోదరావు, పి.సుధాకర్, జి.మాధవరావు, పి.రమేష్, బుచ్చిబాబు, బి.హన్మంతరావు, ఆర్.టీ.రావు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,326	3,000
ఏసీ మిర్చి	15,000	8,000
మిర్చి	8,500	7,500
పత్తి	7,500	6,500

– ఖమ్మం వ్యవసాయం

సత్వర న్యాయం.. శాశ్వత పరిష్కారం

నేడు జాతీయ లోక్‌అదాలత్

● జిల్లా కోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌ల ఏర్పాటు



లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్ (ఫైల్)

ఖమ్మంలీగల్: కోర్టుల్లో కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు ప్రత్యామ్నాయంగా నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌లు కక్షిదారులకు వరంగా మారాయి. ఈ లోక్‌అదాలత్‌ల నిర్వహణతో రాజీపడదగిన అనేక కేసులకు పరిష్కారం లభిస్తోంది. ప్రతీ లోక్‌అదాలత్‌లో వేలాది కేసులను పరిష్కరిస్తుండగా కక్షిదారుల సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. అంతేకాక కేసులకు శాశ్వత, అంతిమ పరిష్కారం అందుతోంది.

అందరికీ న్యాయసాయం కోసం..

ప్రభుత్వం 1987లో న్యాయసేవాధికార చట్టాన్ని ప్రవేశపెట్టింది. డబ్బు ఉన్న వారికే న్యాయం సొంతం అనే అపోహను తొలగించేలా రాజ్యాంగంలోని 39వ అధికరణ ద్వారా పార్లమెంట్ ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. పేదలకు న్యాయ సాయం అందించేలా న్యాయ విజ్ఞాన సదస్సులు, కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. ప్రీ లిటిగేషన్ కేసుల్లో ఎక్కువశాతం విచారణకు ముందే లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమవుతున్నాయి. అంతేకాక గ్రామీణ ప్రాంతాల్లో చట్టం, న్యాయంపై అవగాహన లేని వారికి సత్వరన్యాయం అందించడమే లక్ష్యంగా లోక్‌అదాలత్‌లు కొనసాగుతున్నాయి.

ప్రత్యామ్నాయ పరిష్కారం

రాజ్యాంగం కల్పించిన చట్టం, న్యాయాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించేందుకు న్యాయసేవా సంస్థలు అవతరించాయి. 'ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతి' సూత్రాన్ని అనుసరించి ప్రభుత్వం ప్రజా న్యాయపీఠం(లోక్ అదాలత్) ప్రక్రియను ప్రవేశపెట్టింది. న్యాయసేవాధికార సంస్థల చట్టంలోని 9వ అధికరణ ప్రకారం న్యాయపరమైన సమస్యలను ఉభయులకు నచ్చచెప్పి వారి సమ్మతితో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తారు. ఎవరు కూడా ఆర్థిక కారణాలు, ఇతర అంశాలతో న్యాయాన్ని పొందే అవకాశం కోల్పోకుండా ఉచిత న్యాయ సాయం సైతం అందిస్తున్నారు.

గత లోక్‌అదాలత్‌ల్లో పరిష్కారమైన కేసులు

నిర్వహణ	పరిష్కారమైన కేసులు
మార్చి 2024	7,665
జూన్ 2024	10,712
డిసెంబర్ 2024	8,519
మార్చి 2025	19,345

నేడు జాతీయ లోక్‌అదాలత్

జిల్లా కోర్టు ఆవరణతో పాటు జిల్లాలోని పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఇందులో అత్యధిక కేసులు పరిష్కరించేలా ఇప్పటికే ముందస్తు లోక్ అదాలత్‌లు నిర్వహించారు. అలాగే పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, బీమా కంపెనీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎక్కువ కేసులు పరిష్కరించేలా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ప్రత్యేక చొరవ చూపారు.

ప్రత్యేక బెంచ్‌ల ఏర్పాటు

జిల్లా కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహణకు ఎనిమిది బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఆయా బెంచ్‌లకు మూడు అదనపు జిల్లా జడ్జి రాంప్రసాదరావు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి టి.మురళీమోహన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కె.దీప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిలు బి.రజిని, వై.బిందుప్రియ, వి.మాధవి, బి.నాగలక్ష్మి నేతృత్వం వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని కోర్టుల్లో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి. రాజీ మార్గమే రాజమార్గంగా భావిస్తే కేసులు పరిష్కరించుకోవచ్చు. ఇరువర్గాలు రాజీపడితే సత్వర న్యాయం అందుతుంది. జిల్లాలో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులు ముందుకు రావాలి.

– జి.రాజగోపాల్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

గిరిజన వసతిగృహాల్లో కార్మికుల సమ్మె



ఎన్నెస్పీ క్యాంప్‌లోని వసతిగృహం వద్ద ధర్నాలో వర్కర్లు, నాయకులు

● వేతనాల కోసం కుక్‌లు, కామాటిలు, వాచ్‌మెన్ల విధులు బహిష్కరణ

● కొన్నిచోట్ల అల్పాహారం, భోజనం అందక విద్యార్థుల ఇక్కట్లు

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డెయిలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. కొద్దినెలలుగా కుక్, కామాటి, వాచ్‌మన్లకు వేతనాలు రాకపోవడంతో శుక్రవారం విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. జిల్లాలో డెయిలీ వేజ్ వర్కర్లు 77 మంది, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు 45 మంది ఉండగా.. వీరు విధులు బహిష్కరించడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉదయం అల్పాహారం వండి వడ్డించే వారు లేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు వార్డెన్లకు సూచించారు. కానీ వార్డెన్లు పట్టనట్లు వ్యవహరించడంతో విద్యార్థులకు టిఫిన్ అందలేదు. రెగ్యులర్ వర్కర్లు ఉన్నచోట్ల నుంచి అవసరమైన వసతిగృహాలకు కొందరిని పంపించారు. ఇంకొన్ని వసతిగృహాల్లో విద్యార్థులతోనే వంట చేయించినట్లు తెలిసింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం..

వేతనాలు అందలేదని వర్కర్లు విధులు బహిష్కరించారు. ఈ ప్రభావంతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వార్డెన్లకు సూచించాం. రెగ్యులర్ వర్కర్లు ఉన్న చోటనుంచి అవసరమైన వసతిగృహాలకు పంపించాం. ఎక్కడ కూడా విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూస్తున్నాం.

– విజయలక్ష్మి, డీడీ, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ

కార్మిక సంఘాల మద్దతు

వసతిగృహాల్లోని ఔట్‌సోర్సింగ్, డెయిలీ వేజ్ వర్కర్ల సమ్మెకు కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని బాలికల కళాశాల వసతిగృహం ఎదుట వర్కర్లతోపాటు కార్మిక సంఘాల నేతలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడుతూ కొద్దినెలలుగా వర్కర్లకు వేతనాలు ఇవ్వకపోడమే కాక పనిభారం మోపారని తెలిపారు. ఇకనైనా పెండింగ్ వేతనాలు చెల్లించి, శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, డీవైఎఫ్ఐ నాయకులు సింగు నరసింహారావు, సుభాన్, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి



పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

సత్తుపల్లిరూరల్: పంటలకు అవసరం మేరకే నత్రజని ఎరువు వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. సత్తుపల్లి మండలంలోని కిష్టారం, తుంబూరు, గంగారం పీఏసీఎస్‌ల్లో యూరియా పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పంటలకు కొంత మొత్తంలో నానో యూరియా, నానో డీఏపీలను పిచికారీ చేస్తే ఇక్కట్లు ఉండవని తెలిపారు. జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు పంపిణీ చేస్తున్నందున ఎక్కడా కొరత లేదని వెల్లడించారు. అనంతరం కిష్టారం, బేతుపల్లిల్లో పంటల నమోదు ప్రక్రియను డీఏఓ తనిఖీ చేశారు. సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ టి.శ్రీహరి, ఏఓ వై.శ్రీనివాసరావు, ఏఈఓలు డి.నరేష్, టి.సాయివాసంతి, కె.ఆశాజ్యోతి పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ మున్సిపల్ ఫోరం కమిటీ ఎన్నిక



సుధాకర్, అధ్యక్షుడు



శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు

ఖమ్మంమయూరిసెంటర్: టీఎన్జీవోస్ అనుబంధ మున్సిపల్ ఫోరం నూతన కమిటీని ఖమ్మంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్తుపల్లి, మధిర, వైరా, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీలతో పాటు ఖమ్మం కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొనగా.. ఒక్కో సెట్ నామినేషన్లే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి తాళ్లూరి శ్రీకాంత్ ప్రకటించారు. ఫోరం అధ్యక్షుడిగా ఏ.సుధాకర్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా ఈ.ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాస్, కె.లింగయ్య, జె.నాగరాజు, జె.సుచిత, కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అలాగే, సంయుక్త కార్యదర్శులుగా ఎం.సాంబయ్య, సీహెచ్.శ్రీనివాస్, జె.రాంబాయి, ఏ.ప్రేమ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా బి.నాగేశ్వరరావుతో పాటు ఇతర పదవులకు బి.సుధీర్, కె.శ్రీకాంత్, అవినాష్, కే.హేమనాథ్‌సాయి, ఎం.ప్రవీణ్ కుమార్, పి.రజిని, కృష్ణకుమారి, కవిత, అనురాధ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కొమరగిరి దుర్గాప్రసాద్, జెడ్.ఎస్.జైపాల్, యర్రా రమేష్, లలితకుమారి, ప్రభాకరాచారి, రుక్మారావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీకి రంగం సిద్ధం

● ముగిసిన టెండర్ల దాఖలు గడువు

ఖమ్మంవ్యవసాయం: ఎట్టకేలకు చేపపిల్లల కొనుగోళ్ల టెండర్ల ప్రక్రియ శుక్రవారంతో పూర్తయింది. జిల్లాలో నిర్దేశించిన జలాశయాలకు చేపపిల్లలు సరఫరా చేసేందుకు టెండర్ల దాఖలు గడువు మూడు సార్లు పొడిగించిన అనంతరం ముగిసింది. ఈమేరకు ఏడుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా, వీరి ఫామ్స్‌ను పరిశీలించి ఖరారు చేశాక చేపపిల్లల పంపిణీ మొదలుకానుంది. ఇప్పటికే అదును దాటుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతుండగా ఎట్టకేలకు ప్రక్రియలో వేగం పెరగడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాకు 3.49కోట్ల పిల్లలు

జిల్లాలోని 882 రిజర్వాయర్లు, పెద్ద చెరువులు, చిన్న చెరువుల్లో నీటి సామర్థ్యం, విస్తీర్ణం ఆధారంగా చిన్న, పెద్ద చేప పిల్లలు పంపిణీ చేస్తారు. 80–100 మి.మీ.ల సైజు పెద్ద చేపపిల్లలు 2.11 కోట్ల వరకు, 35–40 మి.మీ. ఉండే చిన్న పిల్లలు 1.38 కోట్లు కలిపి 3.49 కోట్ల చేపపిల్లలకు జలాశయాల్లో విడదల చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4 కోట్లు వెచ్చించనుంది. కాగా, టెండర్లు దాఖలు చేసిన వారి సీడ్ ఫామ్స్‌ను జిల్లా మత్స్యశాఖ అధికారి నేతృత్వాన బృందం పరిశీలిస్తుంది. ఆతర్వాత అదనపు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీ టెండర్లను పరిశీలించి తక్కువ బిడ్ దాఖలు చేసిన వారిని ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి జలాశయాల్లో చేపపిల్లలను వదలాలని మత్స్యశాఖ కసరత్తు చేస్తోంది.

రైతువేదికలో జరిగిన ఘటనపై కలెక్టర్ ఆరా

కామేపల్లి: కామేపల్లి రైతు వేదికలో గురువారం యూరియా కూపన్ల పంపిణీ సందర్భంగా జరిగి న ఘటనపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆరా తీశా రు. రైతులతో ఏఈఓలు దురుసుగా ప్రవర్తించినట్లు కథనాలు రావడంతో నివేదిక ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించినట్లు తెలిసింది. కాగా, కూపన్లు పంపిణీ చేస్తుండగా జాస్తిపల్లికి చెందిన రైతు రాయల కృష్ణ తనతో పాటు కామేపల్లి ఏఈఓ శ్రీకన్యను దూషించాడంటూ మద్దులపల్లి ఏఈఓ రవికుమార్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

తీరని యూరియా వెతలు



తల్లాడ : అన్నారుగూడెం రైతువేదిక వద్ద క్యూలో రైతులు



నేలకొండపల్లి : పీఏసీఎస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతుకు నచ్చచెబుతున్న పోలీసులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడెం సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు సీపీఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్ర ప్రభుత్వం తీరు కూడా అలాగే ఉందని ఆరోపించారు. నాయకులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, దివ్వెల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● **తల్లాడ:** తల్లాడ సొసైటీ పరిధి రైతువేదికల్లో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. అన్నారుగూడెం, బిల్లుపాడుల్లో కూపన్ల ఆధారంగా బందోబస్తు నడుమ పంపిణీ చేపట్టారు.

● **నేలకొండపల్లి:** నేలకొండపల్లి పీఏసీఎస్‌లో యూరియా పంపిణీకి మూడు రోజుల క్రితం కూపన్లు జారీ చేశారు. వీటి ఆధారంగా ఒక్కో రైతుకు బస్తా చొప్పున యూరియా ఇస్తుండగా కొన్ని కూపన్లపై నంబర్లు డబుల్ రావడంతో వివాదం నెలకొంది. దీనిపై ఓ రైతు నేలపై పడుకుని నిరసన తెలిపారు. అక్కడకు వచ్చిన ఏఓను నిలదీయగా కూపన్లు ఉన్న అందరికీ యూరియా పంపిణీ చేశారు.

● **వైరా:** గత నెలలో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చినా ఇప్పటికీ యూరియా పంపిణీ చేయలేదని పలువురు రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా శుక్రవారం వైరా తహసీల్దార్, ఏఓ కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. వైరా రిజర్వాయర్ కింద సాగు చేసిన వరి పంటకు యూరియా లేక ఎదుగుదల లోపిస్తోందని తెలిపారు. అయితే, రెండు రోజుల్లో యూరియా అందించే ఏర్పాట్లు చేస్తామని వైరా ఎస్ఐ పి.రామారావు, ఏఓ మంజుఖాన్ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రైతు సంఘం నాయకులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములకు ఫెన్సింగ్



హెచ్చరిక బోర్డు వద్ద ఆర్‌డీఓ, తహసీల్దార్

ఖమ్మం అర్బన్: రఘునాథపాలెం సమీపాన ఖమ్మం అర్బన్ మండల పరిధి మల్లెమడుగు లో వివాదాస్పద భూములకు పోలీసుల పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఫెన్సింగ్ వేశారు. ఆర్‌డీఓ నరసింహారావు, తహసీల్దార్ సైదులు, ఉద్యోగులు భూములకు ఫెన్సింగ్ వేయించి ఎవరూ ప్రవేశించవద్దని సూచిస్తూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సుమారు 29ఎకరాల భూమికి సంబంధించి కొన్నేళ్లుగా మల్లెమడుగు రైతులు, భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు, ప్రభుత్వానికి మధ్య వివాదం కొనసాగుతోంది. భూముల్లోకి ఎవరూ వెళ్లొద్దని కోర్టు ఆదేశాలు ఉన్నా కొందరు సాగు చేయడంతో ఫెన్సింగ్ వేయించామని ఆర్‌డీఓ, తహసీల్దార్ తెలిపారు. కాగా, భూమి కొనుగోలు చేసినట్లు చెబుతున్న టి.శ్రీనివాసరావు మాట్లాడారు. అధికారులు తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఫెన్సింగ్ వేయడం సరికాదని, ఈ అంశంపై చట్టపరంగా పోరాడుతామని తెలిపారు.

హైవేపై సర్వీస్ రోడ్డు కోసం రైతుల ధర్నా



రైతులకు మద్దతు ప్రకటిస్తున్న దయానంద్

పెనుబల్లి: గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా మండలంలోని కొత్తరాయిగూడెం, పాతకారాయిగూడెం వద్ద ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలని పెనుబల్లి మండల రైతులు శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ హైవేపై చిన్న బ్రిడ్జిల నిర్మాణంతో పొలాలకు యంత్రాలు, వాహనాలను తీసుకెళ్లడం కష్టమవుతుందని వాపోయారు. కాగా, రైతులకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ హైవే అధికారి అమరేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. అలాగే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని దయానంద్ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

తిరుమలాయపాలెం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి సూచించారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీ నుంచి విడదీసి పాతర్లపాడులో ఏర్పాటుచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె అదనపు జిల్లా వైద్యాధికారి అరుణతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ రికార్డులు పరిశీలించడంతో మందుల లభ్యత, చికిత్స వివరాలు ఆరాతీసి ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్ డే సందర్భంగా తిరుమలాయపాలెం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కృపా ఉషశ్రీ, అమర్‌సింగ్, బొల్లికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి



తొర్లికొండ కృష్ణ (ఫైల్)

మధిర: మధిరలో మృత్యుంజయ స్వామి ఆలయ సమీపాన వైరా నదిలో ఈతకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెంకు చెందిన తొర్లికొండ కృష్ణ(45) మధిరలో సెంట్రింగ్ వర్క్ చేస్తాడు. కొద్దిరోజులుగా మధిరచెరువులో ఈత నేర్చుకుంటున్న ఆయన పలువురితో కలిసి వైరా నదికి వెళ్లాడు. అయితే, చెక్‌డ్యామ్ వద్ద ప్రవాహంలో కృష్ణతో పాటు రామ్ కొట్టుకుపోయారు. ఈక్రమాన కృష్ణను రామ్ బయటకు లాగి వెళ్తుండగా ఒడ్డుకు వచ్చేసరికి కృష్ణ నీటిపై తేలియాడుతూ కనిపించాడు. కాగా, వరద భయంతో గుండె ఆగి మృతి చెందాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. మధిర టౌన్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతులను రెచ్చగొట్టారంటూ జర్నలిస్టుపై కేసు

కొణిజర్ల: ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెప్పాలని రైతులను ప్రేరేపించారంటూ ఓ టీవీ చానల్ (సాక్షి కాదు) రిపోర్టర్‌పై కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 11న కొణిజర్ల సొసైటీ కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం బారులు దీరారు. అక్కడకు వచ్చిన రిపోర్టర్ సాంబశివరావు, తదితరులు యూరియా సరిపోవడం లేదని చెప్పాలంటూ రైతులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేశారని ఎస్సై సూరజ్ తెలిపారు. కొణిజర్లకు చెందిన గంధం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని వెల్లడించారు. కాగా, జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసు ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఆధ్వర్యాన జర్నలిస్టులు అడిషనల్ డీసీపీని ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు.